సాక్షి
మంచిర్యాల
శుక్రవారం । 29 । డిసెంబర్ । 2023



మెరుగుపడిన వైద్యసేవలు

జిల్లాలో వైద్యపరంగా ఈ ఏడాది ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. మంచిర్యాలలో టీహబ్ సేవలు ప్రారంభించగా, మెడికల్ కళాశాల, ఆస్పత్రి నిర్మాణాలూ షురూ అయ్యాయి. 10లో▸



కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు

జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసి కేక్ కట్ చేశారు. రక్తదానం చేశారు. 11లో▸

గరిష్టం/కనిష్టం
29.0 /15.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఏఐటీయూసీ విజయోత్సవ ర్యాలీ



విజయోత్సవంలో పాల్గొన్న నాయకులు

రామకృష్ణాపూర్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ యూనియన్ ఘన విజయం సాధించడంతో యూనియన్ నాయకులు, సీపీఐ శ్రేణులు గురువారం రాత్రి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్కే1 సుభాష్‌నగర్ నుంచి రామాలయం, సూపర్ బజార్ మీదుగా బీజోన్ వరకు మోటార్‌సైకిల్ ర్యాలీ చేపట్టారు. బాణాసంచాలు కాలుస్తూ, నృత్యాలు చేస్తూ సంబురాలు చేసుకున్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధనలో అంకితభావంతో పనిచేస్తున్నామని, సింగరేణి కార్మికులు ఏఐటీయూసీకి అఖండ విజయాన్ని అందించారని అన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతీ హామీని యూనియన్ నిలబెట్టుకుంటుందని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మిట్టపెల్లి శ్రీనివాస్, సురమల్ల వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ ప్రదర్శనకు సిద్ధం కావాలి

మంచిర్యాలఅర్బన్: జనవరిలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనకు విద్యార్థులు సంసిద్ధం కావాలని డీఈవో యాదయ్య తెలిపారు. 2022–23 విద్యాసంవత్సరానికి 102 మంది విద్యార్థులు ఇన్‌స్పైర్ అవార్డు మనక్ స్కీంకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. జనవరి 1 నుంచి 18వరకు జిల్లాస్థాయి e-dlepcలో పాల్గొనడానికి ఎంపికైన ప్రదర్శన వీడియో, ఇతర వివరాలను ఇన్‌స్పైర్ మనక్ కాంపిటీషన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. 19 నుంచి 25వరకు ఎన్ఐఎఫ్ జ్యూరీ ద్వారా జిల్లాల వారీగా ఆన్‌లైన్‌లో డీఎల్ఈపీసీల నిర్వహణ–మూల్యాంకనం, 26న రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైన ప్రాజెక్టుల జాబితా ప్రదర్శన, 26 నుంచి 31 వరకు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థుల ప్రాజెక్టులను ఇన్‌స్పైర్ మనక్ కాంపిటీషన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఫిబ్రవరి 1నుంచి 3వరకు ఎన్ఐఎఫ్ జ్యూరీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా రాష్ట్రస్థాయి e-slepc నిర్వహణ–మూల్యాంకనం చేయాలని తెలిపారు. స్కూల్ హెడ్మాస్టర్లు, గైడ్ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రాజెక్టు ప్రదర్శనకు సిద్ధం చేయాలని, వివరాలకు డీఎస్‌వో మధుబాబును సంప్రదించాలని తెలిపారు.

బేస్‌బాల్ పోటీల్లో కాంస్య పతకం



పతకం సాధించిన విద్యార్థులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కాసిపేట బాలుర గురుకుల విద్యార్థులు రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో సత్తాచాటారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు అండర్–19 తరఫున కాంస్య పతకం గెలుచుకున్నారు. వరంగల్ జిల్లా తొర్రూర్‌లోని ఎస్వైఆర్ఆర్ క్రీడా మైదానంలో ఈ నెల 25న రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు నిర్వహించారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్‌కుమార్, సీఓఈ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు క్రీడాకారులను అభినందించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్–19 ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ బాబురావు, ఫిజికల్ డైరెక్టర్లు అల్లూరి వామన్, సల్పాల సంతోష్, కుమ్మరి శ్రీకాంత్, పీఈటీ కోట యాదగిరి పాల్గొన్నారు.

రాజకీయ మార్పు!



మంచిర్యాల రోడ్ షోలో అమిత్‌షా(ఫైల్)



నస్పూర్ సత్యాగ్రహసభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, రేవంత్‌రెడ్డి, భట్టి, ఉత్తమ్(ఫైల్)



చెన్నూరు రోడ్ షోలో కేటీఆర్(ఫైల్)

- ఈ ఏడాదిలో పరిస్థితి తారుమారు
- కాంగ్రెస్‌కు జోష్ నింపిన సమయం
- బీఆర్ఎస్ పార్టీకి కలసి రాని కాలం
- జిల్లా రాజకీయాల్లో పెనుమార్పులు

ROUND UP 2023 POLITICAL

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాలచక్రం గిర్రున తిరిగింది. ఈ ఏడాది కాలం జిల్లా రాజకీయాల్లో పెనుమార్పులు తీసుకొచ్చింది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఈ సంవత్సరంలోనే జరగడంతో నాయకుల పార్టీ మార్పులు, సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఓటమి చవిచూడాల్సి వచ్చింది. గత పదేళ్లుగా జిల్లాలో తిరుగులేని రాజకీయ శక్తిగా ఎదిగిన గులాబీ పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. శాసనసభ ఎన్నికల్లో చేదు ఫలితాలతో కారు పార్టీ బోల్తా కొట్టింది. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీలో జోష్ పెరిగింది. జిల్లా పరిధిలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో హస్తం పార్టీ హవా కొనసాగింది. దీంతో కొత్త ఎమ్మెల్యేలు, కొత్త సర్కారుతో ప్రస్తుతం ఊపు మీద ఉంది. ఇదే ప్రభావం వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లోనూ కనిపించే అవకాశం ఉంది. ఈ ఏడాది కాలంలో జిల్లాలో జరిగిన ముఖ్య రాజకీయ మార్పులు నెమరువేసుకుంటే ఎంతో మార్పు కనిపిస్తోంది.

'భట్టి' పాదయాత్రతో జోష్

గత ఏప్రిల్‌లో ప్రస్తుత ఉపముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మల్లు భట్టి విక్రమార్క జిల్లాలో 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర మూడు నియోజకవర్గాల్లో నిర్వహించారు. అదే నెల 14న రాష్ట్రంలోనే తొలిసారి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా సత్యాగ్రహ సభ ఏర్పాటు చేయగా విజయవంతమైంది. ఈ సభతో జిల్లాలో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపింది. ఆ సమయంలో కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు(పీఎస్సార్) అన్నీ తానై వ్యవహరించారు.

అసెంబ్లీ ఎన్నికల కోలాహలం

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో రెండు నెలలపాటు రాజకీయ కోలాహలం నెలకొంది. జాతీయ, రాష్ట్ర నాయకుల సభలు, సమావేశాలు, రోడ్ షోలతో వేడెక్కింది. జిల్లాలో నాలుగు నియోకవర్గాల్లోనూ బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు, ఖానాపూర్(జన్నారం) పరిధిలో హస్తం పార్టీ హవా కొనసాగింది. బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్‌లకే టికెట్లు ఇచ్చింది. ఖానాపూర్ పరిధిలో అక్కడి ఎమ్మెల్యే రేఖానాయక్ కాకుండా కేటీఆర్ సన్నిహితుడు భూక్య జాన్సన్‌నాయక్‌కు ఇచ్చారు. బెల్లంపల్లి నుంచి వినోద్, మంచిర్యాల నుంచి పీఏ స్సార్, ఖానాపూర్ నుంచి బొజ్జు గెలిచారు. బీజేపీకి మంచిర్యాల నియోజకవర్గంలో తొలిసారిగా చెప్పుకోదగిన స్థాయిలో ఓట్లు వచ్చాయి. చెన్నూరు, బెల్లంపల్లిలో బీజేపీ ప్రభావం చూపలేదు. ఇక బీఎస్పీ తదితర పార్టీలు ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రయత్నించాయి. ఈ నెలలో జరిగిన సింగరేణి గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల్లో జిల్లాలోని మూడు ఏరియాల్లోనూ ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ విజయఢంకా మోగించగా, రెండోస్థానంలో ఐఎన్‌టీయూసీ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ నిలిచింది. బీఆర్ఎస్ పార్టీ అనుబంధ టీబీజీకేఎస్ ఉనికిని కోల్పోయింది.

కాంగ్రెస్‌లో చేరిన ఓదెలు, వివేక్

మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఆయన సతీమణి జెడ్పీ చైర్‌పర్సన్ గత సెప్టెంబర్‌లో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ చేరారు. ఎన్నికల సమయంలో బీజేపీ నుంచి గడ్డం వివేక్ కాంగ్రెస్‌లో చేరి, చెన్నూరు నుంచి పోటీ చేసి గెలిచారు. చెన్నూరు టికెట్ దక్కని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రాజారమేశ్ బీఆర్ఎస్‌లో చేరగా, దాసారపు శ్రీనివాస్ బీఎస్పీలో చేరారు.

'పుర' పాలికల్లో అవిశ్వాసాలు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతోనే బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు ఆ పార్టీలో చేరడంతో బెల్లంపల్లి, మంచిర్యాల, నస్పూర్ పట్టణాల్లో చైర్మన్, వైస్‌చైర్మన్లపై అవిశ్వాసం తీర్మానాలకు నోటీసులు ఇచ్చారు. దీంతో అవిశ్వాస సమావేశానికి తేదీలు ఖరారు చేశారు. బెల్లంపల్లి చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, నస్పూర్ వైస్ చైర్మన్ కాంగ్రెస్‌లో చేరారు. వీరితోపాటు కౌన్సిలర్లు కండువాలు మార్చారు. కొత్త ఏడాదిలో పట్టణ పాలక వర్గాల్లో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లు మారే అవకాశం ఉంది.

ఇది కార్మికుల విజయం

- హామీలన్నీ అమలు చేస్తాం
- ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య



సమావేశంలో సీతారామయ్య, నాయకులు

శ్రీరాంపూర్: ఇది కార్మికుల విజయమని ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య అన్నారు. ఏఐటీయూసీ సింగరేణిలో గుర్తింపు సంఘంగా గెలిచిన సందర్భంగా గురువారం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు ఎంతో కష్టపడి ఎన్నికల్లో భారీ మెజార్టీతో యూనియన్‌ను గెలిపించారని అన్నారు. యువ కార్మికులు ఎంతో విజ్ఞతతో ఆలోచించి ఓటేశారని, ఇతర కార్మిక సంఘాలు ఐఎన్టీయూసీ, టీబీజీకేఎస్ కార్యకర్తలు కూడా ఏఐటీయూసీకి ఓటేశారని, వారికి కూడా ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన మేనిఫెస్టోను అమలు చేస్తామని, కొత్త భూగర్భ గనులు, అలవెన్స్‌లపై ఆదాయపన్ను మాఫీ, స్వంతింటి పథకం వంటి హామీలు నెరవేరుస్తామని తెలిపారు. ఖమ్మం తదితర ఏరియాల్లో అధికార పార్టీ మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు ఓటర్లను డబ్బులు, మద్యంలతో ప్రలోభాలకు గురిచేసి గెలిచారని ఆరోపించారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కలిసివచ్చే అన్ని సంఘాలను కలుపుకొని పోతామన్నారు. ఈ సమావేశంలో యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచీ సెక్రెటరీ ఎస్కే బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, నాయకులు సారయ్య, వీ.రాజేశ్వర్‌రావు, బాపు, అఫ్రోజ్‌ఖాన్, నర్సింగరావు పాల్గొన్నారు.

126 మందికి ర్యాపిడ్ టెస్టులు

మంచిర్యాలటౌన్: జిల్లాలో గురువారం 126 మందికి కరోనా ర్యాపిడ్ టెస్టులు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా కరోనా లక్షణాలతో ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చిన వారిలో అనుమానితులు 126 మందికి పరీక్షలు చేశారు. అందరికీ నెగెటివ్‌గా వచ్చిందని కరోనా జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఫయాజ్‌ఖాన్ తెలిపారు.

రగ్గుల్లేవు.. కార్పెట్లు రావు..!



రగ్గులు, కార్పెట్లతో విద్యార్థులు(ఫైల్)

- కేజీబీవీల్లో విద్యార్థినుల ఇబ్బందులు
- పంపిణీలో తీవ్ర జాప్యం

మంచిర్యాలఅర్బన్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయా(కేజీబీవీ)ల్లో విద్యార్థినులు కప్పుకునే రగ్గులు.. నేలపై పర్చుకునే కార్పెట్లు పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. విద్యార్థినులకు పూర్తి స్థాయిలో పంపిణీ చేసి ఐదేళ్లు గడుస్తోంది. గత ఏడాది డిసెంబర్‌లో రగ్గులు, కార్పెట్లు సరఫరా చేసినా వచ్చింది తక్కువే. కొన్ని కేజీబీవీల్లో వందల సంఖ్యలో విద్యార్థులు ఉండగా 40కి మించి పంపిణీ చేయకపోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. హైదరాబాద్ నుంచి ది తెలంగాణ స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్ కార్పొరేషన్ సొసైటీ లిమిటెడ్ నేరుగా కేజీబీవీలకు సరఫరా చేసింది. వచ్చిన రగ్గులు ఎలా పంపిణీ చేయాలో అర్థంకాక అధికారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ ఏడాది చలికాలంలో విద్యార్థులు గజ గజ వణికిపోతుండగా.. రగ్గులు ఇంకా ఎప్పుడు పంపిణీ చేస్తారోనని విద్యార్థులు ఎదురుచూడాల్సి వస్తోంది.

ఇంటి నుంచి తెచ్చుకోవడమే..

జిల్లాలో 18 కేజీబీవీల్లో 4,506 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. విద్యాలయాల్లో ప్రవేశం పొందిన వారికి ఏకరూప దుస్తులతోపాటు జత దుప్పట్లు, కార్పెట్లు అందజేయాలి. 2017 విద్యాసంవత్సరం వరకు క్రమం తప్పకుండా సరఫరా చేయడంతో విద్యార్థులకు పంపిణీ చేస్తూ వచ్చారు. గతేడాది కొత్తగా ప్రవేశాలు పొందిన ఇంటర్, ఆరో తరగతి విద్యార్థులకు మాత్రమే సరఫరా చేసేవారు. మిగతా తరగతులకు చెందిన విద్యార్థులకు రగ్గులు, కార్పెట్లు లేకపోవడంతో ఇంటి నుంచి తెచ్చుకుని సర్దుకుపోతున్నారు. పాత విద్యార్థుల మాటేలా ఉన్నా ఈ ఏడాది మాత్రం కొత్తగా ప్రవేశం పొందిన వారికి కూడా రాకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

గతేడాది అరకొర..

ప్రతియేటా పంపిణీ చేసిన కార్పెట్లు, రగ్గులు కూడా అరకొరగానే సరఫరా చేస్తున్నారు. 2017, 2019లో పంపిణీ చేసిన దుప్పట్లు, కార్పెట్లు ఒక్కో కేజీబీవీకి 50లోపు మాత్రమే పంపిణీ చేశారు. గతేడాది పూర్తిస్థాయిలో విద్యార్థులకు పంపిణీ చేస్తారనుకుంటే అదీ లేదు. 361 మంది విద్యార్థులు ఉండగా 40, మంచిర్యాలలో 352 మందికి 40, మందమర్రిలో 245 మందికి 80 మంది విద్యార్థులకు మాత్రమే చలి రగ్గులు వచ్చాయి. కొన్ని కేజీబీవీలకు విద్యార్థుల సంఖ్య కంటే ఎక్కువగా వచ్చినట్లు తెలుస్తోంది. దండేపల్లి, జన్నారం, లక్సెట్టిపేట, కాసిపేటలో వందల సంఖ్యలో బాలికలు విద్యనభ్యసిస్తున్నా ఒక్కటంటే ఒక్కటి కూడా రగ్గులు, కార్పెట్లు సరఫరా చేయలేదు. కొత్తగా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు కూడా పంపిణీ చేయలేదు. ఈ ఏడాదైనా రాకపోతాయా..? అని ఎదురు చూస్తున్నా నిరాశ ఎదురవుతోంది. అధికారులు చొరవ తీసుకుని చలి రగ్గులు పంపిణీపై దృష్టి సారించాలని విద్యార్థులు కోరుతున్నారు.

నిలిచిన ప్లేట్లు, గ్లాసులు, ట్రంక్ బాక్సుల సరఫరా

కేజీబీవీలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాంతో ట్రంకు బాక్సులు, గ్లాస్, ప్లేట్లు అందించాల్సి ఉంటుంది. పుస్తకాలు, విద్యార్థుల వస్తువులు దాచుకునేలా ట్రంకు బాక్సులు ఇస్తుంటారు. అన్నం తినే ప్లేట్, గ్లాస్ అందించాల్సి ఉంటుంది. 2017 సెప్టెంబర్‌లో ట్రంక్‌బాక్సులు, 2017 అక్టోబర్‌లో గ్లాస్, ప్లేట్లు పంపిణీ చేశారు. అప్పటి నుంచి వీటి సంగతి మార్చిపోయారు. దీంతో విద్యార్థులు ట్రంక్‌బాక్సులు, గ్లాస్, ప్లేట్లు కొనుగోలు చేయకతప్పడం లేదు. ఈ విషయమై సెక్టోరల్ అధికారి యశోధరను సంప్రదిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, దుప్పట్లు, కార్పెట్లు వచ్చిన వెంటనే పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

తొలిరోజు 23,315



చెన్నూర్: పట్టణంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్

- 'ప్రజాపాలన'కు దరఖాస్తుల వెల్లువ
- సాయంత్రం వరకు స్వీకరించిన అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల లబ్ధిదారుల ఎంపికకు జిల్లాలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో తొలి రోజు గురువారం దరఖాస్తులు వెల్లువెత్తాయి. జిల్లాలోని ఏడు మున్సిపాలిటీలు, 16 మండలాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో 23,315 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో మండలంలో నాలుగు గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీల్లోని వార్డుల్లో మొత్తం 232 ప్రజాపాలన సంక్షేమ పథకాల లబ్ధిదారుల దరఖాస్తు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తంగా 58,0008 కుటుంబాలకు చెందిన 23,315మంది దరఖాస్తులు అందజేశారు. అధికంగా దండేపల్లి మండలంలో 1188, అత్యల్పంగా వేమనపల్లి మండలంలో 88 దరఖాస్తులు వచ్చాయి. మంచిర్యాల మున్సిపాల్టీలో అధికంగా 5,564, అత్యల్పంగా క్యాతనపల్లిలో 436 దరఖాస్తులు అందాయి. కాగా, మండలాల్లోని 58 కేంద్రాల్లో 17,833 కుటుంబాలకు 8,425 దరఖాస్తులు స్వీకరించారు. మున్సిపాల్టీల్లో 174 కేంద్రాలు ఏర్పాటు చేయగా 40,175 కుటుంబాలకు గాను 14,890 దరఖాస్తులు స్వీకరించారు.

మండలాల వారీగా..

బెల్లంపల్లి మండలంలో 498 దరఖాస్తులు, భీమారంలో 287, భీమినిలో 450, చెన్నూర్‌లో 418, దండేపల్లిలో 1,188, హాజీపూర్‌లో 488, జైపూర్‌లో 1070, జన్నారంలో 994, కన్నెపల్లిలో 510, కాసిపేటలో 396, కోటపల్లిలో 312, లక్సెట్టిపేటలో 350, మందమర్రిలో 339, నెన్నెలలో 721, తాండూర్‌లో 316, వేమనపల్లిలో 88 దరఖాస్తులు వచ్చాయి.

మున్సిపాల్టీల్లో..

బెల్లంపల్లి మున్సిపాల్టీలో 2,717 దరఖాస్తులు, చెన్నూర్‌లో 1,386, క్యాతనపల్లిలో 436, లక్సెట్టిపేటలో 894, మంచిర్యాలలో 5,564, మందమర్రిలో 1,954, నస్పూర్‌లో 1,939 దరఖాస్తులు వచ్చాయి.

అదనపు కలెక్టర్ పరిశీలన

జిల్లాలోని భీమారం, చెన్నూర్, కోటపల్లి మండలాల్లో నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ గురువారం పరిశీలించారు. మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలపై గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. దరఖాస్తుల స్వీకరణకు స్త్రీ, పురుషులకు వేర్వేగా క్యూలైన్లు, మహిళల కోసం ప్రత్యేక కౌంటర్లు, క్యూలైన్ల బారికేడ్లు ఏర్పాటు చేశారు.

ప్రజల దరికి ప్రభుత్వ పథకాలు



దరఖాస్తులు స్వీకరిస్తున్న జెడ్పీ సీఈఓ నరేందర్

అర్హులకు ప్రభుత్వ పథకాలు

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందించేందుకు ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 19వ వార్డులో గురువారం ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా దరఖాస్తుల శిబిరాలను పరిశీలించారు. ఈ పథకాలకు కుటుంబం యూనిట్‌గా పరిగణిస్తామని, కుటుంబం నుంచి ఒకరు దరఖాస్తు అందించాలని అన్నారు. దరఖాస్తు ఫారాలతో ఆధార్‌కార్డు, తెల్లరేషన్ కార్డు జిరాక్సులను జతపర్చాలని, దరఖాస్తుదారులకు రశీదు అందించాలని తెలిపారు. ఆయా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రతీ దరఖాస్తుకు ఒక ప్రత్యేక సంఖ్య కేటాయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, మేనేజర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రజాపాలన ద్వారా అర్హులైన లబ్ధిదారుల దరికి పథకాలు చేరుతాయని ప్రజాపాలన మంచిర్యాల నియోజకవర్గ ఇంచార్జి, జెడ్పీ సీఈఓ నరేందర్ అన్నారు. గురువారం హాజీపూర్ మండలం ర్యాలీ, నాగారం, గఢ్‌పూర్, చిన్నగోపాల్‌పూర్ గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాలు ప్రారంభించారు. జెడ్పీ సీఈఓ నరేందర్ మాట్లాడుతూ జనవరి 6వరకు ప్రతీ రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాజీపూర్ మండల ఇంచార్జి రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ సతీశ్ కుమార్, ఎంపీడీఓ అబ్దుల్‌హై, నాయబ్ తహసీల్దార్ హరిత, గిర్దావర్‌లు మంగ, ప్రభు, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్‌గౌడ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గిరిజ, మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ వినయ్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ర్యాలీలో 82, నాగారంలో 75, గఢ్‌పూర్‌లో 240, చిన్నగోపాల్‌పూర్‌లో 91 దరఖాస్తులు అందాయి.

మంచు దుప్పటి



మంచిర్యాలలో రైలుపట్టాలపై పొగ మంచు



మంచిర్యాల ప్రధాన రహదారిపై..



మందమర్రిలోని కోల్‌బెల్ట్ రహదారి



నెన్నెల గ్రామంలో..



భీమారంలో జాతీయ రహదారి

మంచిర్యాలక్రైం/నెన్నెల/భీమారం/బెల్లంపల్లిరూరల్/మందమర్రిరూరల్: జిల్లాను మంచు దుప్పటి కప్పేసింది. ఎదురుగా వచ్చే వారు కనిపించనంతగా దట్టమైన పొగమంచు కమ్ముకుని ఉంది. గురువారం ఉదయం పది గంటల వరకు రహదారులపై ముందు వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో లైట్లు వేసుకుని వెళ్లాల్సి వచ్చింది. రెండ్రోజులుగా చలి తీవ్రత కూడా పెరిగింది. కాజీపేట-బల్లార్షా మధ్య నడిచే రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని, రైళ్ల వేగాన్ని తగ్గించి నడిపించామని రైల్వే అధికారులు తెలిపారు. నెన్నెల, భీమారం, బెల్లంపల్లి, మందమర్రి మండలాల్లో రహదారులపై పొగమంచు కమ్ముకుని ఉంది. నెన్నెల మండలంలోని పలు గ్రామాల్లో పొలాలకు వెళ్లే రైతులు, పత్తి సేకరణకు వెళ్లే కూలీలు అవస్థలు పడ్డారు. సూర్యుడు వచ్చే వరకు ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రాలేదు. భీమారం మండలంలో మంచిర్యాల-చెన్నూరు జాతీయ రహదారిపై పొగమంచు కారణంగా రాకపోకలకు ఇబ్బందిగా మారింది. బెల్లంపల్లి మండలం మాలగురిజాల, గురిజాల, లంబాడితండా, దుగ్నెపల్లి, పెర్కపల్లి, బట్వాన్‌పల్లి గ్రామాల్లో పొగమంచు కమ్ముకుంది. మందమర్రిలో తొమ్మిది గంటల వరకు పట్టణమంతా పొగమంచు కమ్ముకుని ఉంది. సింగరేణి విధులకు వెళ్లే వారికి ఎదురుగా వచ్చే వాహనాలు లైట్లు వేసుకుని వచ్చినా కనిపించక వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

క్లుప్తంగా

పెద్దపల్లి పార్లమెంట్ బీఎస్పీ ఇన్‌చార్జిగా రవీందర్


కాదాసి రవిందర్

శ్రీరాంపూర్: బీఎస్పీ పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గం ఇంచార్జిగా శ్రీరాంపూర్‌కు చెందిన కాదాసి రవీందర్‌ను నియమించారు. ఈ మేరకు గురువారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో నియోజకవర్గం ఇంచార్జిగా నియమించినందుకు రవీందర్ పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు

ఆనంద నిలయంలో బాలుడు..


వికాస్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఒంటరిగా ఉన్న బాలుడిని పోలీసుశాఖ 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బందికి అప్పగించారని, ఆ బాలుడి ఆచూకీ తెలిసిన వారు, సంబంధికులు ఉంటే సంప్రదించాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య తెలిపారు. ఆరేళ్ల వయస్సు కలిగిన వికాస్ అనే బాలుడు ఈ నెల 17వ తేదీన ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఒంటరిగా ఉండగా పోలీసులు గుర్తించి తమకు అప్పగించడంతో ఆ బాలుడిని సిడబ్ల్యూసీ ఆదేశాల మేరకు తాత్కాలిక వసతి కోసం ఐఆర్‌సీఎస్ ఆనంద నిలయంలో చేర్చడం జరిగిందన్నారు. బాలుడి సంబంధిత వ్యక్తులు ఎవరైనా తగిన ధృవపత్రాలతో బాల రక్షాభవన్‌లో ఈ నెల 30వ తేదీలోగా సంప్రదించాలని కోరారు. ఆ తరువాత ఆ బాలుడిని ఆదిలాబాద్‌లోని శిశుగృహానికి తరలించినున్నట్లు వివరించారు. వివరాలకు 9441506519, 7032462331 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యవర్గం

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని ఇల్లందు క్లబ్‌లో గురువారం జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సుభాష్, ఉపాధ్యక్షుడిగా లాల్‌బాయ్, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ అజార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ప్రవీణ్‌నాయక్, జాయింట్ సెక్రెటరీగా జ్యోతి, కోశాధికారిగా సతీష్ ఎన్నికయ్యారు. నూతన కమిటీకి ఎన్నికల అధికారి ప్రశాంత్ ధ్రువీకరణ పత్రాలు అందజేసి అభినందించారు. ఫారెస్ట్ స్టాఫ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కమిటీ తెలిపింది.

జిల్లా ప్రధాన కార్యదర్శిగా తిరుపతి


పత్రం అందుకుంటున్న తిరుపతి

జన్నారం: జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని కవ్వాల్ గ్రామానికి చెందిన అమరగొండ తిరుపతి నియామకం చేశారు. మంచిర్యాలలో జరిగిన జిల్లా సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య తిరుపతికి నియామక పత్రం అందజేసినట్లు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చిన రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలిపారు.

మెరుగుపడిన వైద్య సేవలు..

- జిల్లాకు టీహబ్ సేవలు ప్రారంభం
- మెడికల్ కళాశాల, ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభం
- మోకీలు మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతం
- ఏసీబీకి చిక్కిన డీఎంహెచ్‌వో కార్యాలయ ఉద్యోగులు
- కొంత ఖేదం, కొంత మోదంతో ఏడాది పూర్తి




మిషన్ ఇంద్రధనుష్‌లో చిన్నారులకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

మంచిర్యాలటౌన్: జిల్లాలో 2023 సంవత్సరంలో ప్రభుత్వ వైద్య సేవలు మెరుగుపడ్డాయి. గతంతో పోలిస్తే, ఈ ఏడాది ప్రభుత్వ ఆసుపత్రులను పెంచారు. 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుబంధంగా ఉన్న 121 ఉప కేంద్రాలను పల్లె దవాఖానాలుగా మార్చి వైద్యులను నియమించారు. వీటితో పాటు పట్టణ ఆరోగ్య కేంద్రాలు 4 ఉండగా, వాటికి ఉపకేంద్రాలు 28 ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యం కోసం చేపట్టిన పలు కార్యక్రమాలు సైతం జిల్లాలో విజయవంతం అయ్యాయి. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఈ ఏడాది మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సను చేసి వైద్యులు విజయం సాధించారు. ఆగస్టు 22వ తేదీన అత్యాధునికంగా సిద్ధం చేసిన నవజాత శిశువు అంబులెన్సును జిల్లాకు ప్రభుత్వం అందించింది. బెల్లంపల్లిలో 100పడకల ఆస్పత్రిని ప్రారంభించారు. కానీ సరిపడా వైద్య సిబ్బంది లేరు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల గుర్తింపు

అసాంక్రమిక వ్యాధుల సమగ్ర ఆరోగ్య పరీక్షలు(ఎన్‌సిడి) కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 3,59,507 మందిని పరీక్షించగా 43,384 మందికి బీపి, 15,868 మందికి మధుమేహం, 186 మందికి క్యాన్సర్‌లో బ్రెస్ట్ క్యాన్సర్ 102 మందికి, సెర్విక్స్ క్యాన్సర్ 53 మందికి, ఓరల్ క్యాన్సర్ 31 మందికి ఉన్నట్లుగా గుర్తించారు.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు మెరుగు

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను పెంచడంతో పాటు, సిజేరియన్లను తగ్గించేందుకు చేపట్టిన పలు కార్యక్రమాలు విజయవంతం అయ్యాయి. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేటుల్లో 7,061 ప్రసవాలు జరగ్గా, 3,731 ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో, 3,330 ప్రసవాలు ప్రైవేటులో జరిగాయి.

ఆరోగ్య మహిళా క్లినిక్‌లు సక్సెస్

జిల్లాలో మహిళా క్లినిక్‌ల ద్వారా అన్ని రకాల వైద్య పరీక్షలను నిర్వహించారు. 11,928 మందికి వైద్య పరీక్షలు చేయగా 42 మంది అనుమానితుల్లో నుంచి 17మందిని రెఫర్ చేసి ఏడుగురికి వైద్యం చేశారు. బ్రెస్ట్ క్యాన్సర్ ఉన్న 36 మందికి చికిత్స అందించారు. సెర్వికల్ క్యాన్సర్ ఉన్న 24మందికి చికిత్స అందించారు. 13,640 మందిని పరీక్షించగా 536 మందికి హైపర్ థైరాయిడ్, 1,540 మందికి మెనోపాజ్ సమస్యలు, 576 మందికి యూరిన్ ఇన్‌ఫెక్షన్ అయినట్లు గుర్తించి వైద్యం అందించారు.

గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లు

గర్భిణుల్లో రక్తహీనత, మాతాశిశు మరణాల శాతం తగ్గించేలా, పుట్టే పిల్లల్లో పౌష్టికాహార లోపం నిర్ధారణకు గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను ఈ ఏడాది మే నెలలో ప్రభుత్వం ప్రారంభించింది. జిల్లా వ్యాప్తంగా 6,900ల మందికి న్యూట్రిషన్ కిట్లు అందించారు.

టీహబ్‌తో 134 రకాల వైద్య పరీక్షలు

తెలంగాణ డయాగ్నోస్టిక్స్ కేంద్రం(టీహబ్)ను ఈ ఏడాది జులై 1వ తేదీన ప్రారంభించారు. ఇందులో 134 రకాల వైద్య పరీక్షలను చేసేందుకు దీనిని ఏర్పాటు చేశారు. పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది లేక ఇబ్బందిగా మారింది.

కంటి వెలుగు పరీక్షలు


కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోశ్(ఫైల్)

ఈ ఏడాది జనవరి 19వ తేదీన జిల్లాలో ప్రారంభించిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 4,11,081 మందికి కంటి పరీక్షలను నిర్వహించగా, కంటి సమస్య కొంచెం ఉన్నవారిలో 68,924 మందిని గుర్తించి, వారికి రీడింగ్ గ్లాస్‌లను అందించారు. కంటి సమస్య ఎక్కువ ఉన్నవారిలో 61,463 మందిని గుర్తించగా, అందులో ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్‌ను 58,632 మందికి అందించగా, 2,831 మందికి ఇవ్వాల్సి ఉంది.

అవినీతి మరకలు

జిల్లావైద్య ఆరోగ్య శాఖకు ఈ ఏడాది అవినీతి మరక అంటుకుంది. ఈ ఏడాది జూన్ 13వ తేదీన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పనిచేసిన సూపరింటెండెంట్ షఫియొద్దిన్, సీనియర్ అకౌంటెంట్ దీపిక, అకౌంటెంట్ రాజనర్సులు రూ.10వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.

గంజాయి విక్రయిస్తే చర్యలు


మాట్లాడుతున్న సీఐ నరేందర్, పక్కన ఎస్సై రమేష్

రెబ్బెన(ఆసిఫాబాద్): ప్రభుత్వం నిషేధించిన గంజాయిని పండించినా, రవాణా చేసినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని సీఐ అల్లం నరేందర్ హెచ్చరించారు. తిర్యాణి మండలంలోని ఖైరిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని లచ్చుగూడ గ్రామానికి చెందిన ఆత్రం లింగారావు తన పెరటిలో పండిస్తున్న గంజాయి మొక్కలను తిర్యాణి ఎస్సై గురువారం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ మేరకు తిర్యాణి పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించాడు. లచ్చుగూడలో అక్రమంగా గంజాయి మొక్కలు సాగుచేస్తున్నారనే సమాచారంతో తిర్యాణి ఎస్సై సీహెచ్ రమేష్ సిబ్బందితో కలిసి తహసీల్దార్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించాడు. లింగారావు ఇంటివెనుక భాగంలోని పెరటిలో గంజాయి మొక్కలు గుర్తించాడు. పంచనామా నిర్వహించి నిందితుడి నుంచి ఐదు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని వాటిని తూకం వేయగా సుమారు 9కిలోల బరువు ఉన్నట్లు తేలిందన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు వివరించారు. సమావేశంలో ఎస్సై రమేష్ ఉన్నారు.

బావిలో పడి వివాహిత మృతి

జన్నారం: ప్రమాదవశాత్తు బావిలోపడి వివాహిత మృతి చెందిన ఘటన జన్నారం మండలం రేండ్లగూడలో చోటు చేసుకుంది. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. జన్నారం మండలం రేండ్లగూడ గ్రామానికి చెందిన నెల్కి సత్తవ్వ(35) భర్త శ్రీనివాస్‌తో కలిసి గురువారం తన వ్యవసాయ బావి వద్దకు గడ్డికట్టలు కట్టేందుకు వెళ్లింది. అనంతరం బావి సమీపంలో అనుమతీగ కాయలు తెంపుతున్న క్రమంలో సత్తవ్వ కాలికి తీగ తట్టుకుని ప్రమాదవశాత్తు బావిలో పడిపోయింది. భర్త రక్షించే ప్రయత్నం చేసిన ఫలితం లేదు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం లక్షెట్టిపేట ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి బత్తుల మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి 14ఏళ్ల కూతురు ఐశ్వర్య, పదేళ్ల కొడుకు అర్చిత్ ఉన్నారు.

పంట చేలల్లోకి చిరుత

- పంట పొలాలకు వెళ్లేందుకు జంకుతున్న కూలీలు


మిరప తోటలో చిరుత పాదముద్రలు

వేమనపల్లి: మండల కేంద్రం శివారులోని ఏరుమద్దులు, కొత్తపల్లివాగు పంట చేళ్ల వైపు చిరుత పులి సంచరిస్తుంది. గ్రామానికి చెందిన గూడె అశోక్‌కు తన మిర్చి తోట నుంచి మూడు రోజుల క్రితం చిరుత వెళ్లినట్లు గుర్తించాడు. మిర్చీ తోటకు నీటి తడులు ఇచ్చి ఇంటికి వచ్చాడు. రాత్రిపూట మిర్చి తోటలో తిరిగి పక్కన ఉన్న పత్తి చేళ్ల గుండా కొత్తపల్లి వాగు దాటి గొర్లపల్లి, కల్మలపేట శివారులోకి వెళ్లి ఉండొచ్చని అధికారులు, రైతులు అనుమానిస్తున్నారు. రైతుల సమాచారం మేరకు అటవీ, బేస్ క్యాంపు సిబ్బంది మిర్చి తోట వైపు వెళ్లి పంచనామా చేశారు. పాదముద్రలు సేకరించారు. పత్తి సేకరణకు వెళ్లే రైతులు చిరుత సంచారంతో చేనులకు వెళ్లేందుకు జంకుతున్నారు. అటవీ అధికారులు చిరుత సంచారంపై సమగ్ర పరిశీలన చేసి ఎటు వెళ్లింది? ఏమైన రక్షణ చర్యలు పాటించాలా? అనే విషయాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పందుల జాడ పసిగట్టి..

పత్తి పంట సీజన్ కావడంతో అడవి పందులు మేత కోసం పత్తి, వరి పొలాల వైపు వస్తున్నాయి. వీటిని వేటాడేందుకు చిరుత పులి పందుల జాడ పసిగట్టి చేళ్ల వైపు వచ్చినట్లు స్థానికులు తెలుపుతున్నారు. ఏరుమద్దులు, ప్రాణహిత తీరం, కొత్తపల్లి, నీల్వాయి వాగు పుష్కలంగా నీటి వనరులు ఉన్నాయి. ఈ ప్రాంతంలోనే పత్తి పంట ఉంది. అడవి పందులు సైతం ఈ ప్రాంతంలో మకాం పెట్టడంతో చిరుతకు అనువైన మేత లభ్యమవుతుంది. గత ఎనిమిది నెలల క్రితం కల్లంపల్లి, ముక్కిడిగూడ, దస్నాపూర్ అటవీ ప్రాంతాల్లో చిరుత పులులు సంచరిస్తున్నాయి. మేకలు, ఆవులు సైతం పొట్టనపెట్టుకున్నాయి. చిరుత ఆహార అన్వేషణలో భాగంగా పంట చేళ్ల వైపు వచ్చి ఉండవచ్చని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


సుప్రీత్‌రెడ్డిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జన్నారం: మండల కేంద్రంలోని స్లేట్ ఎక్సలెన్స్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి ఏనుగు సుప్రిత్‌రెడ్డి జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు స్లేట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 23 నుంచి 25వరకు వరంగల్ జిల్లా తొర్రూర్‌లో జరిగిన అండర్-14 విభాగం రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో ఎంపిక చేశారని పేర్కొన్నారు. త్వరలో తమిళనాడులో జరిగే జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. విద్యార్థిని చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు సంతోష్, నగేశ్, నాగలక్ష్మీ, రమేశ్, కృష్ణ అభినందించారు.

నిబంధనలు పాటించని యువత

- విచ్చలవిడిగా బైక్ రైడ్‌లు
- శబ్దాలతో ప్రజలు ఇబ్బందులు
- ట్రాఫిక్‌తో నానా అవస్థలు
- పలు రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత
- పట్టించుకోని అధికారులు

లక్సెట్టిపేట: పట్టణంలో వాహనదారులతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వందలాది వాహనాలతో ప్రజలతో రద్దీగా ఉండే రహదారిపై యువకులు విచ్చలవిడిగా బైక్‌లపై తిరుగుతూ ప్రజలను అవస్థలకు గురిచేస్తున్నారు. యువత నిబంధనలు పాటించకుండా లైసెన్సు లేకుండా బైక్‌లపై ముగ్గురు, నలుగురు తిరుగుతు అతివేగంగా వెళ్తున్నారు. బుల్లెట్ బైక్‌పై వెళ్తూ పెద్ద పెద్ద శబ్దాలను చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. రద్దీగా ఉండే ప్రదేశంలో బైక్‌లతో అతివేగంగా తిరుగుతూ ఇతరులకు ఇబ్బందులు కల్గిస్తున్నారు. ఇటీవల ఒక బైక్‌పై ముగ్గురు యువకులు అతివేగంగా వచ్చి బీట్‌బజార్‌లో ఆగి ఉన్న కారును ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. ఇలా తరచు పట్టణంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నవి.


ఒక బైక్‌పై నలుగురు యువకులు

ట్రాఫిక్‌తో ఇబ్బందులు

పట్టణంలో ప్రధాన రహదారి అంబేద్కర్ చౌక్ నుంచి బస్టాండు వరకు ఒకటే రోడ్డు ఉంటుంది. రోడ్డు ఇరుకుగా ఉండడతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. దుకాణదారులకు వచ్చే సరుకులను తీసకువచ్చే భారీ లారీలు రోడ్లపై నిలుపుతూ అన్‌లోడ్ చేయడంతో ఇతర వాహనాలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఆటోలు, బస్సులు, లారీలు బైక్‌లు, ఇతర వాహనాలతో నిత్యం పట్టణంలో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అంబేద్కర్ చౌక్, బీట్ బజార్, గాంధీ చౌక్ బస్టాండు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య విపరీతంగా ఉంటుంది. ఆదివారం, గురువారం వారాల్లో రెండు రోజులు సంత ఉండడంతో విపరీతమైన రద్దీ ఉంటుంది. సంబంధిత అధికారులు పట్టించుకుని ట్రాఫిక్, బైక్ రైడింగ్ చేస్తున్న యువకులపై చర్యలు తీసుకొని ప్రజల ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



పట్టణంలో కొంచెం ట్రాఫిక్ సమస్య ఉంది. వాహనాలను అదుపు చేస్తున్నాం. కొన్ని ప్రదేశాల్లో ట్రాఫిక్ కానిస్టేబల్స్‌ను నియమించాం. యువత విచ్చల విడిగా వాహనాలను నడిపిన లైసెన్సులు లేకున్న, రాష్ డ్రైవింగ్ చేసిన కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

ఎస్సై లక్ష్మణ్, లక్సెట్టిపేట

ఐఎన్టీయూసీ కొంపముంచిన చేరికలు

- టీబీజీకేఎస్ నేతల రాకతో కార్మికుల్లో వ్యతిరేకత
- ఓట్లపై తీవ్ర ప్రభావం
- ఎమ్మెల్యే కృషితోనే ఈ మాత్రం ఓటు బ్యాంక్

శ్రీరాంపూర్: అడ్డగోలు చేరికలు సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్టీయూసీ కొంపముంచాయి. సింగరేణిలో ఆరు డివిజన్లలో గెలిచిన ఐఎన్టీయూసీకి శ్రీరాంపూర్‌లో కూడా గెలుపు అవకాశాలు ఉంటాయని ఎన్నికలకు కొద్ది రోజులు ముందు ఆ యూనియన్ నేతలు భావించారు. కానీ ఫలితాలు తారుమారయ్యాయి. కార్మికుల్లో తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్న టీబీజీకేఎస్ నేతలను వెనుకాముందు చూసుకోకుండా పెద్దయెత్తున చేర్చుకోవడం ఐఎన్టీయూసీ ఓటమికి కారణమైందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. టీబీజీకేఎస్‌లో ఏర్పడ్డ నాయకత్వ సంక్షోభంతో శ్రీరాంపూర్ ఏరియాలో బ్రాంచీ ముఖ్య నేతలు, ఫిట్ సెక్రెటరీలు, పలువురు నాయకులు ఎన్నికలకు కొద్ది రోజుల ముందే ఐఎన్టీయూసీలో చేరారు. వీరిలో కొందరు అధికారంలో ఉన్నప్పుడు వ్యవహరించిన తీరు, ప్రదర్శించిన అధికార దర్పం వల్ల కార్మికుల్లో తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకున్నారు. కొందరికి అవినీతి మరకలున్నాయి. వారే మళ్లీ అధికారం కోసం ఐఎన్టీయూసీలో చేరారని, ఇక ఐఎన్టీయూసీ గెలిచిన కూడా మళ్లీ పాతకథే పునరావృతం అవుతుందని భావించి ఐఎన్టీయూసీకి వ్యతిరేక ఓటు వేసినట్లు కొందరు కార్మికులు బాహాటంగానే పేర్కొంటున్నారు. ఐఎన్టీయూసీ మొదటి నుంచి పనిచేసిన నేతలు కూడా టీబీజీకేఎస్ నుంచి వచ్చిన కొందరి ముఖ్య నాయకుల పట్ల తీవ్ర వ్యతరేకతతోనే ఉన్నారని తెలిసింది. టీబీజీకేఎస్ కీలక పదవులు అనుభవించి, అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ముఖ్య నాయకులను పక్కన పెట్టి, క్లీన్ ఇమేజ్ ఉన్న నేతలు, కింది స్థాయి కార్యకర్తలను మాత్రమే చేర్చుకుని ఉంటే ఈ ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చేవని ఐఎన్టీయూసీ కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

ఎమ్మెల్యేకు ఇష్టం లేకున్నా..

టీబీజీకేఎస్‌లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని చేర్చుకోవడం మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుకు మొదటి నుంచీ ఇష్టం లేదు. కార్మికుల్లో వ్యతిరేకత ఉన్న ముఖ్య నేతలను చేర్చుకోవద్దని పలుమార్లు యూనియన్ నాయకత్వాన్ని హెచ్చరిస్తూ వచ్చారు. ఐఎన్టీయూసీ నాయకత్వం వారినే చేర్చుకుంది. ఎమ్మెల్యే అసెంబ్లీ సమావేశాలకు హైదరాబాద్‌కు వెళ్లి వచ్చేలోపే ఈ చేరికలు జరిగాయి. దీనిపై ఆయన ఒకింత ఆగ్రహం వ్యక్తం కూడా చేశారని తెలిసింది. చివరికి యూనియన్ గెలుపుపై దృష్టి పెట్టి ప్రచారం రంగంలో దిగారు. సమావేశాలు ఏర్పాటు చేయడం, పార్టీ కార్యకర్తలను కూడా రంగంలోకి దించి గనుల వారీగా కార్మికులను కలిసి వారికి ఐఎన్టీయూసీని గెలిపిస్తే ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయించే బాధ్యత తనది అంటూ భరోసా ఇచ్చారు. దీంతో కాస్త బలం పెరిగింది. క్రితం 6వ దఫా ఎన్నికల్లో పోటీ కూడా చేయలేని దుస్థితిలో ఉన్న ఐఎన్టీయూసీకి నేడు ఈ ఎన్నికల్లో 2,690 ఓట్లు రావడం ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ప్రభావమేనని ఆ యూనియన్ వారు పేర్కొంటున్నారు. టీబీజీకేఎస్ చేరికలతో బలపడుతామనుకొన్న ఐఎన్టీయూసీ నాయకత్వానికి ఈ చేరికలే ఎన్నికల్లో కొంప ముంచాయనేది నగ్న సత్యం.

బొగ్గుచోరీ పేరిట.. జేసీబీ, లారీలు స్వాధీనం


ఎస్‌అండ్‌పీసీ ఆఫీస్ ఆవరణలోని జేసీబీ


కేకే-1 కాంట వద్ద లారీలు

- గోప్యంగా ఉంచిన అధికారులు
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయని వైనం

మందమర్రిరూరల్: బొగ్గుచూరను దొంగిలించుకుపోతున్నారనే సమాచారంతో అధికారులు జేసీబీ, రెండు లారీలను నాలుగు రోజుల క్రితం పట్టుకున్నారు. కానీ నేటికీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదు. ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల వివరాల ప్రకారం... నాలుగు రోజుల క్రితం మందమర్రి ఏరియాలోని ఆర్కే 1ఏ సమీపంలో (పాతఆర్యన్ కంపెనీ కోల్ వాషర్ ప్లాంట్) బొగ్గు చూరను దొంగతనంగా తరలించుకుపోతున్నారనే సమాచారంతో ఏరియా క్వాలిటీ అధికారి, సెక్యూరిటీ అధికారులు అక్కడికి వెళ్లారు. జేసీబీతో పాటు రెండు లారీలు కనిపించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. జేసీబీని మందమర్రి ఏరియా ఎస్‌అండ్ పీసీ ఆఫీస్‌లో, రెండు లారీలను కేకే-1 కాంట వద్ద ఉంచారు. ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదు. అలాగే ఉన్నతాధికారులకు సైతం సమాచారం అందించలేదు. లావాదేవీల కోసమే అధికారులు ఈ తతంగం నడిపిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై సాక్షి క్వాలిటీ అధికారిని వివరణ కోరగా.. మళ్లీ కాల్ చేస్తానని దాటవేశాడు. సదరు యజమాని తన జేసీబీ, లారీలను అక్రమంగా సింగరేణి అధికారులు స్వాధీనం చేసుకున్నారని రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

కార్మికులకు అండగా ఉంటాం


ఉద్యోగులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

రెబ్బెన: ఏరియాలో పని చేస్తున్న కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉంటూ హక్కుల సాధన కోసం పోరాడుతామని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్ రావు అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో బెల్లంపల్లి ఏరియాలో ఏఐటీయూసీని గెలిపించిన కార్మికులను గురువారం టీబీజీకేఎస్ నాయకులు కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు మాట్లాడారు. ఏరియాలో టీబీజీకేఎస్ మద్దతు తెలిపిన ఏఐటీయూసీ ఏరియాలో 122 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించటం శుభపరిణామమన్నారు. ఏఐటీయూసీ గెలుపునకు కృషి చేసిన టీబీజీకేఎస్ ఏరియా నాయకులు, కార్యకర్తలకు, ఓటు వేసిన గెలిపించిన కార్మికులందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామని తెలిపారు. ఏరియాలో పనిచేసే కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చిన టీబీజీకేఎస్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏరియా నాయకులు చంద్రశేఖర్, మారిన వెంకటేష్, మాజీ ఏరియా ఉపాధ్యక్షుడు నల్లగొండ సదాశివ్, నాయకులు అలవేణి సంపత్, రవీందర్, మాంకయ్య, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుల ధర్నా


ఆందోళన చేపడుతున్న పారిశుధ్య కార్మికులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు, ఎన్‌ఎంఆర్ కార్మికులు ధర్నాకు దిగారు. తమకు నెలనెలా వేతనాలు చెల్లించాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ డబ్బులు కార్మికుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ డబ్బులు కార్మికుల ఖాతాలో జమ చేసేందుకు అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని, వేతనాలు అందక తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్య పనులకు వెళ్లకుండా కార్మికులు తెల్లవారు జామున 5గంటలకు బల్దియా కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ అంజయ్య అక్కడికి చేరుకొని కార్మికులను నచ్చజెప్పారు. వేతనాలు చెల్లింస్తామని, ఈఎస్‌ఐ, పీఎఫ్ డబ్బులు వారి ఖాతాల్లో జమ చేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో కార్మికులు ధర్నా విరమించారు.

నాగ్‌పూర్ సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు


సభకు వెళ్లడానికి సిద్ధమైన శ్రేణులు

బెల్లంపల్లి: మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగే కాంగ్రెస్ ఆవిర్భావ సభకు గురువారం బెల్లంపల్లి నుంచి కాంగ్రెస్ శ్రేణులు బయలుదేరి వెళ్లారు. బజారు ఏరియాలోని పట్టణ కాంగ్రెస్ కార్యాలయం వద్ద నుంచి ప్రత్యేక బస్సుల్లో నాయకులు కాంగ్రెస్ ఆవిర్భావ సభకు తరలివెళ్లారు. అంతకు ముందు కాంగ్రెస్ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య పతాకావిష్కరణ చేశారు.

భీమిని: కన్నెపల్లి, భీమిని మండలాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగ్‌పూర్ సభకు తరలివెళ్లారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాదవరపు నర్సింగరావు, కన్నెపల్లి, భీమిని మండలాల అధ్యక్షులు రామాంజనేయ ఉన్నారు.

వేమనపల్లి: మండలం నుంచి ఎంపీటీసీ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు.

ఈకేవైసీ కోసం దరఖాస్తులు


గ్యాస్ కేంద్రం వద్ద కేవైసీ కోసం వేచి ఉన్న ప్రజలు

లక్సెట్టిపేట: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సబ్సిడీ గ్యాస్ కోసం ఈకేవైసీ దరఖాస్తుల కోసం లబ్ధిదారులు ఇండేన్ గ్యాస్ కేంద్రం వద్ద బారులు తీరారు. ఉదయం నుంచి మహిళలు పెద్ద ఎత్తున క్యూలో ఉంటూ ఇబ్బందులు పడుతున్నారు. ఈకేవైసీ తీసుకోవడంతో లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ వస్తుందని తెలియడంతో మహిళలు ఉదయం నుంచి గ్యాస్ కేంద్రం వద్ద బారులు తీరుతున్నారు.